


# మేస్టారి స్వగతం

- ఇలపావులూరి మురళీమోహనరావు

**ఆ** రోజుతో ముకుందరావుగారు హైస్కూలు ప్రధానోపాధ్యాయునిగా పదవీ విరమణ చేస్తున్నారు. మూడున్నర దశాబ్దాలకు పైగా కొనసాగిన ఆయన ఉపాధ్యాయ జీవితం ఎలిమెంటరీ స్కూల్ టీచర్ నుంచి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయ స్థాయికి విస్తరించింది. ఎంతోమందిని ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్ది నాలుగుసార్లు ఉత్తమ ఉపాధ్యాయునిగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల అవార్డులు పొందారు. ఏ ఊళ్ళో పని చేసినా బదిలీ మీద వెళ్తున్నపుడు ప్రజలు కన్నీటితో వీడ్కోలు చెప్పేవారు. ప్రభుత్వాన్ని శాపనార్థాలు పెట్టేవారు.

ఆ ఊళ్ళోనే లాయర్లుగా, డాక్టర్లుగా, పెద్ద వ్యాపారులుగా స్థిరపడిన ఆయన పూర్వ శిష్యులంతా కలిసి స్కూలు ఆవరణలో మేస్టారికి వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, అభిమానులతో సభాప్రాంగణం క్రిక్కిరిసి పోయింది. చాలామంది కంటతడి పెడుతున్నారు. తోటి ఉపాధ్యాయులదీ అదే పరిస్థితి!

మున్సిపల్ ఛైర్మన్ సాయిబాబు సభాధ్యక్షులుగా విచ్చేశారు. నలుగురు సీనియర్ టీచర్లు, ఇద్దరు మేస్టారి పూర్వ శిష్యులు, ముకుందరావుగారు వేదిక నలంకరించారు.

ఛైర్మన్‌గారు లేచారు.

"నేనీ టౌన్లో ఎన్నో మీటింగులు పెట్టాను. కానీ ఇంతమంది జనం పోగవడం ఎన్నడూ చూడలేదు. మేస్టారి పట్ల జనానికున్న అభిమానం చూస్తుంటే అసూయగా ఉన్నది. ఎంతోమందిని ఆయన లాయర్లుగా, ఇంజనీర్లుగా, డాక్టర్లుగా, ఉన్నతాధికార్లుగా తీర్చిదిద్దారు. కులమత వర్గ భేదాలు లేకుండా యావన్మందినీ సమంగా ప్రేమించి అభిమానాన్ని చూరగొన్న అదృష్టశాలి. అటువంటి మేస్టారు రిటైరౌతున్నారంటే చాలా బాధగా ఉంది. కానీ రూల్సు ప్రకారం తప్పదు. ఆయన శేష జీవితం ప్రశాంతంగా, సుఖంగా గడిచిపోవాలని కోరుకుంటున్నాను." అన్నారు.

ఇతర ఉపాధ్యాయులు కూడా మేస్టారి గొప్పదనాన్ని, ఆయనతో తమకుగల అనుబంధాన్ని ప్రస్తావించారు. అటువంటి మేస్టారు రిటైర్ కావడం పట్ల బాధను ప్రకటించారు.

విద్యార్థులలో కొంతమంది దుఃఖాన్ని అణచుకోలేకపోతున్నారు. క్షణాలు గడిచేకొద్దీ మేస్టారు తమతో గడిపే సమయం తక్కువైపోతున్నదన్న విషయం తలుచుకుని కుమిలిపోతున్నారు.

అందరూ ఉపన్యసించిన తరువాత ముకుందరావుగారికి సన్మాన కార్యక్రమం మొదలైంది.

కాశ్మీరీ దుశ్శాలువ కప్పి గజమాలను మేస్టారికి ధరింపజేశారు ఛైర్మన్‌గారు. కళాత్మకమైన నిర్మల్ పెయింటింగ్‌ను మొమెంటోగా అందించారు. అభిమానులు తమ మేస్టారిని సత్కరించుకునే అవకాశం కల్పించి తాను కూర్చున్నారు.

చేత పూలదండలను పట్టుకుని తమ గురువుగారి కంఠసీమ నలంకరింపజేయడానికి సిద్ధంగా ఉన్న అభిమానులు మేస్టారిని చుట్టుముట్టారు. పూలవర్షంలో ముంచెత్తారు. పాదాభివందనాలు చేశారు.

మరికొంతమంది తల్లిదండ్రులు మేస్టారికి నగదు బహుమతులందించారు. ఊరిపెద్దలు కొందరు కన్నీళ్ళతో ఆలింగనం చేసుకుని పదవీ విరమణానంతరం మేస్టారు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని శుభాకాంక్ష లందించారు.

సన్మాన కార్యక్రమం ముగిసిన అనంతరం తన మనోగతం వెల్లడించ వలసిందిగా మేస్టారిని కోరారు ఛైర్మన్‌గారు.

మేష్టారు లేచారు. అప్పటికే ఆయన హృదయం బరువెక్కింది. నీటి పొరలు కళ్ళను కమ్మేశాయి. అభిమాన వర్షంలో తడిసి ముద్దయిన ఆయన మేను చిగురుటాకులా వణుకుతున్నది. నిముషానికోసారి కళ్ళజోడు తీసి తుడుచుకుంటున్నారు. పొడిగా దగ్గి ఆరంభించారు.

"గౌరవనీయులైన మున్సిపల్ ఛైర్మన్, నా శిష్యుడు సాయిబాబుకు, సోదర ఉపాధ్యాయులకు, గ్రామ పెద్దలకు, తల్లిదండ్రులకు నమస్కారాలు. ప్రియశిష్యులకు ఆశీస్సులు.

ఈ రోజుతో నేను రిటైరైపోతున్నానని అంటున్నారు. కానీ అది అబద్ధం. నేను కావాలని రిటైర్ కావడంలేదు. నన్ను రిటైర్ చేయిస్తున్నారు. కారణం! ఈ రోజు సాయంత్రంతో నాకు ఏభై ఎనిమిదేళ్ళు నిండుతున్నాయట! ఉద్యోగికి ఏభై ఎనిమిది నిండితే అతని జీవితానికి నూరేళ్ళు నిండినట్లే. ప్రపంచంలో ప్రతి ఒక్కడూ జీవితాంతం కష్టించి పనిచేస్తాడు ఒక్క ఉద్యోగి తప్ప!

ఏభై ఎనిమిది నిండితే ఇక నేను పాఠాలు చెప్పడానికి పనికిరానట! ఎందుకని? ఏభై ఎనిమిది నిండగానే నా నోరేమైనా పడిపోయిందా? నా మెదడు మొద్దుబారిందా? నా కాలూ చెయ్యి పనిచెయ్యడం మానేశాయా? ఏమీ కాలేదే? మరి నేనెందుకు రిటైర్ కావాలి? ఎందుకంటే – రూల్సు అలా ఉన్నాయట!!

మరి ఈ రూల్సు ఉద్యోగికేనా? ఇంకెవరికీ లేవా? ఏభై ఎనిమిది నిండగానే రైతు పొలం దున్నడం మానేస్తే ఈ శాసనాలు చేసేవాళ్ళు ఏం తింటారు? ఏభై ఎనిమిది నిండగానే నేను పనిచెయ్యనని హృదయం మొరాయిస్తే రోజుకు

ఎన్నివేలమంది మరణిస్తారు?

ఈ దేశ పౌరులందరికీ పనిచేసే హక్కున్నది. అందరికీ పని కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వానికున్నది. అందరికీ పని కల్పించలేకపోయినా పనిచేసే వారిని మాత్రం నిర్దాక్షిణ్యంగా తొలగించే హక్కును ప్రభుత్వాలు తమంతట తామే కల్పించుకుని అమలుపరుస్తున్నాయి.

ఉద్యోగులు ఎప్పుడు రిటైర్ కావాలో నిర్ణయించే శాసనకర్తలకు మాత్రం ఎలాంటి రిటైర్‌మెంట్లూ లేవు. ఎనభై ఏళ్ళు దాటిన వాడు, నలుగురు నడిపిస్తేనే కానీ అడుగుతీసి అడుగువెయ్యలేనివాడు నూరుకోట్ల మంది జనాభా కలిగిన ఈ సువిశాల దేశాన్ని పరిపాలించాలని ఉవ్విళ్ళూరుతుంటాడు. కూర్చుంటే మళ్ళీ లేవడానికి అరగంట సమయం తీసుకునేవాడు ఈ సర్వసత్తాక ప్రజాస్వామ్యదేశానికి అధ్యక్షుడు కావాలని కలగంటాడు. అటువంటి వారితో పోలిస్తే మేము వృద్ధులమా? ఏభై ఎనిమిది నిండితే నూరుమంది పిల్లలకు పాఠాలు చెప్పలేమా??

అదేమంటే నిరుద్యోగులకు అవకాశాలు రావాలికదా అంటారు. నిరుద్యోగులకు అవకాశాలు కల్పించడానికి ఉద్యోగుల పొట్టలు కొట్టడమేనా మార్గం? వేల కోట్ల రూపాయలు అప్పులు తెస్తున్నారు. అవన్నీ ఎటు పోతున్నాయి? వాటితో ఎవరికి ఉపాధి కల్పిస్తున్నారు?

అయినా నిరుద్యోగులు ఈ గుమాస్తా ఉద్యోగాలకేనా అర్హులు? ఒక మంత్రిగానో, ముఖ్యమంత్రిగానో, ప్రధానమంత్రిగానో వారికి ఎందుకు అవకాశం ఇవ్వరు? తాము చచ్చేంతవరకు కుర్చీలను అంటిపెట్టుకుని ఉండే శాసనకర్తలు రాజకీయాలలో ఆసరాగా యువతను వాడుకుంటారు. సాయం చెయ్యవలసి వచ్చేసరికి ఆమడ దూరంలో ఉంచుతారు. ఉద్యోగులు మాత్రం ఏభై ఎనిమిది దాటగానే ఇంటికెళ్ళి గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోవాలి!

పెరిగిన ఆరోగ్య ప్రమాణాల దృష్ట్యా ఎంత లేదన్నా ఈ రోజుల్లో సగటు మనిషి డెబ్భై అయిదు సంవత్సరాలు జీవిస్తున్నాడు. అంటే దాదాపు మరో పద్దెనిమిది సంవత్సరాలపాటు నేను సోమరిగా జీవించాలి. సోమరిపోతుల వలన ఈ సమాజానికి గానీ, ఈ దేశానికి గానీ ఏమైనా ప్రయోజనం ఉన్నదా? సోమరితనాన్ని వదిలించుకోవాలని, సోమరుల బుర్రలు దెయ్యాలకు ఆవాసాలు అని నేటివరకు లక్షలమందికి పాఠాలు చెప్పాము. రేపటి నుండీ సోమరి సత్రాలలోకి బలవంతంగా నెట్టివేయబడుతున్నాము. ఇన్నాళ్ళ మా అనుభవం, మేధస్సు ఇక నుంచీ మాకు రెండు పూటలా ఇంత కూడు పెట్టలేవు కదా!

మీకేమండీ? ఇంట్లో కూర్చుంటే హాయిగా పెన్షన్ వస్తుంది అంటారు చాలామంది. కానీ వచ్చే ఆ పెన్షన్ ఎంత? పూర్తి జీతం వస్తుంటేనే చాలీచాలని జీవితం గడుపుతున్న ఈ రోజుల్లో అర్ధ జీతంతో ఎలా బ్రతుకుతారు అని ఎంతమంది ఆలోచిస్తున్నారు?

కొంతమంది ఉద్యోగులు రిటైరైన తరువాత, సంసారం కుదుట పడక, ఇంట్లో అవమానాలు భరించలేక పూర్తి ఆయుషున్నంత వరకు జీవించలేకపోతున్నారు. రాజకీయ నాయకులు మాత్రం ఎనభై దాటినప్పటికీ ఎంతో ఆరోగ్యంగా కనిపిస్తుంటారు. రోజుకు పదహారు గంటలు సునాయాసంగా పనిచేస్తుంటారు. అంత వయసులో కూడా వారు అంత ఆరోగ్యంగా కనిపించడానికి గల కారణం ఏమిటి? పని! పని! శరీరశ్రమ!! ఈ శరీరానికి నిరంతరం ఏదో ఒక పని ఉండాలి. తనువును కష్టపెట్టే వ్యాపకం ఉండాలి. మనసులో చింత లేకుండటానికి దానికి తగ్గ ప్రతిఫలం ఉండాలి. ఏ యంత్రమైనా రోజూ ఆడిస్తుంటేనే పని చేస్తుంది. నాలుగు రోజులు ముసుగేశామంటే మూలబడుతుంది. మేమూ అంతేకదా!

చాలీచాలని ఆదాయంతో బ్రతకలేక రేపట్నుంచీ ఏ ప్రైవేటు స్కూళ్ళ వాళ్ళనో బ్రతిమలాడుకుని వారు విదిలించే ఏ నాలుగైదు వందలకో వారి వద్ద పనిచెయ్యాలి. ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఇన్నాళ్ళూ వారి నుండి నమస్కారాలు అందుకున్న మేము రేపట్నుంచీ వారికి వంగి వంగి సలాములు చెయ్యాలి.

పూలమ్మిన చోటనే కట్టెలమ్మాలి. జీవిత పర్యంతం ఈ దేశానికి మేమందించిన సేవకు కృతజ్ఞత ఇదేనా?

ప్రభుత్వంలోని కొన్ని శాఖలలో పనిచేసిన వారు రిటైరయ్యే నాటికి కోట్లకు పడగలెత్తుతారు. రిటైర్మెంటును వారు చిరునవ్వుతో స్వీకరిస్తారు. అవినీతితో సంపాదించిన ధనంతో వ్యాపారాలు ఆరంభిస్తారు. పూర్వపు పరిచయా లుపయోగించి వాటిని వృద్ధి చేస్తారు. కానీ మాకు అలాంటి వెసులుబాటు ఏమైనా ఉందా? రేపట్నుంచీ ఈ నాలుగు రాళ్ళూ రావన్న విషయం తలుచుకుంటే రిటైర్‌మెంట్ ఎంత బాధాకరం!

ఈ ప్రజాస్వామ్య దేశంలో పంచాయితీ బోర్డు మెంబర్‌గా ఎన్నికైన వాడు జిల్లా పరిషత్ చైర్మన్ కావాలనుకుంటాడు. మంత్రిగా ఉన్నవాడు ముఖ్యమంత్రి కావాలని, ముఖ్యమంత్రిగా ఉన్నవాడు ప్రధానమంత్రి కావాలని పథకాలు రచిస్తాడు. ఒకసారి ప్రధాన మంత్రి చేసినవాడు మళ్ళీ మంత్రిగావడమో, సర్పంచి కావడమో ఎన్నడైనా జరిగిందా? ఉద్యోగస్తులు మాత్రం ఓనమాలు కూడా రాని వారు చేసిన శాసనాలకు బద్ధులై శంకరగిరి మాన్యాలు పట్టిపోవాలి!

తల్లిదండ్రుల పట్ల పిల్లలకు ఈ రోజుల్లో ఏమాత్రం గౌరవాభిమానాలున్నాయో మీ అందరికీ తెలుసు. సంపాదనలేని పెద్దవారిని కన్నబిడ్డలు ఎంత తుస్కారంగా చూస్తారో మీకు తెలియనిది కాదు. ఎంతోమంది పెద్దలు తమ పిల్లల చేతుల్లో అవమానాలు భరించలేక, ఆ విషయం ఎవ్వరితో చెప్పుకోలేక వృద్ధాశ్రమాలలో చేరేవారు కొందరైతే రైల్వే ప్లాట్‌ఫారాల మీద అడుక్కుతినే వారు కొందరు. పనిచేసే శక్తి ఉన్నవారిని బిడ్డల దయాదాక్షిణ్యాలకు వదిలివేసే ఈ ప్రభుత్వ విధానాలకు ఏమైనా విచక్షణ ఉన్నదా?

అయితే కొంతమంది దౌర్భాగ్యపు తండ్రులుంటారు. వీరు మొదట్నుంచీ కొడుకులంటే ప్రేమ రాహిత్యంతో ఉంటారు. కూతుళ్ళంటే వీరికి చచ్చే ప్రేమ. అల్లుళ్ళు ఎందుకూ కొరగాని చవటలే అయినా ఇంటిపెత్తనమంతా అల్లుళ్ళ కప్పగించి కొడుకులను చవటలుగా చూస్తారు. జన్మనివ్వడం మినహా కొడుకులకు రవ్వంత సాయం చేయకపోయినా వారంతట వారు కష్టపడి వృద్ధిలోకి వస్తే వాళ్ళూ, వారి భార్యలూ తమ చెప్పుకింద తేళ్ళలా పడుండాలని ఆశిస్తారు. కొడుకులతో పంతాలు పెట్టుకుని వారితో పగపెట్టుకోవడానికి కూడా సందేహించరు. నూటికి, కోటికి ఒకరిద్దరుండే ఇలాంటి నికృష్టుల గురించి ఏమాత్రం జాలిపడనవసరంలేదు. కానీ మిగిలిన వారి సంగతేమిటి?

నాకు ఉద్యోగం లేని కొడుకు, పెళ్ళికాని కూతురు ఉన్నారు. నన్ను కన్న తల్లి ఉన్నది. అరకొర ఆదాయంతో వీరందరి భారం ఎలా మొయ్యాలి?

మహాశయులారా! చచ్చేంత వరకూ బ్రతకాలనే కనీసపు కోరికతోనే నా ఆవేదన మీ ముందుంచాను. ఈ రోజుల్లో ప్రతీ చిన్న విషయానికీ ఉద్యమాలు లేవదీస్తున్నారు. ఉద్యోగులు రిటైరైన తరువాత ఎలా బ్రతకాలి అన్న విషయం ప్రభుత్వాన్ని నిలదీసి అడగడానికి ఎవడూ ఉద్యమం చెయ్యడు.

ఒక ఉద్యోగి జీవితం అతడొక్కడి మీదే లేదు. అతనిమీద ఆధారపడిన మరో అయిదారుగురి జీవితం కూడా అతనిమీదే ఆధారపడి ఉన్నది. మా తరం అయిపోయింది. రాబోయే తరాలు మరీ భయంకరంగా ఉంటాయి. మమ్మల్ని కనీసం ఏభై ఎనిమిదేళ్ళ వరకైనా బ్రతికించారు. వచ్చే తరాలను ముప్పై నలభై ఏళ్ళకే రిటైర్ చేయించి వారి జీవితాలను నడి సముద్రంలో ముంచబోతున్నారు. కనీసం భావితరాల భవిష్యత్తు కోసమైనా ఉద్యమించండి. పనిచేసే హక్కును పొందండి. మన ఓట్లతో ఎన్నికై, మనం కట్టే పన్నులతో జీవిస్తున్న ప్రభుత్వాలను మనకు పని కల్పించమని నిలదీయండి.

నా జీవితానుభవంతో ఇస్తున్న సందేశాన్ని అర్థం చేసుకుని ఆచరిస్తే అదే మీరు నాకు చేసే ఘనసన్మానం. అందరికీ కృతజ్ఞతలు."

భారంగా తన కుర్చీవైపు అడుగులు వేశారు ముకుందరావుగారు.

O